


# స్వర్గంలో క్షణికం

— ప్రఫుల్లచంద్ర

కాపలా లేని లెవెల్ క్రాసింగ్‌వద్ద విహారయాత్ర వెళుతున్న విద్యార్థుల బస్సు - ట్రెయిన్‌ను ఢీ కొనగా పది మంది మరణించారు. మరో పదిహేను మందికి తీవ్రంగా గాయాలు తగిలాయి. వారిలో నలుగురు అపస్మారక స్థితిలో ఉన్నారు. వారిని సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు.

అపస్మారక స్థితిలో వున్న ఆ నలుగురు - నటరత్న అభిమాన సంఘాధ్యక్షుడు ఒడ్డూబాబు; అక్కినేని కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు తిక్కబాబు, 'మాగ్నిఫిషెంట్ మాదాల' సంఘాధ్యక్షుడు తిట్టుబాబు, సకల నటీనట అభిమాన సమాఖ్య అధ్యక్షుడు నసబాబు.

వారి అభిమానాలు వేరైనా, అప్పుడప్పుడు తీవ్రంగా వాదించుకున్నా, ఆ నలుగురూ మంచి మిత్రులు.

o o o

వారి శరీరాలు బరువు కోల్పోయాయి. గాలిలో తేలిపోతున్నట్లుగా వుంది, మేఘాలను దూసుకొని పైకి, పైపైకి - హైడ్రోజన్ నింపిన బెలూన్‌లాగ - తేలుతూ వెళ్ళిపోతున్నారు. వాళ్ళకి భయంగానూవుంది. థ్రిల్లింగ్‌గానూ వుంది. వారు అలా తేలిపోతూ వెళుతుండగా స్వరబ్రహ్మ సంగీతం బ్యాక్‌గ్రవుండ్ మ్యూజిక్‌లా వినిపిస్తోంది. కొంత ఎత్తులో 'చిత్రపురి' అన్న అక్షరాలు గాలిలో తేలియాడుతూ కనిపించాయి వాళ్ళకి.

మేఘాల మీద నడుస్తూ చిత్రపురిలో ప్రవేశించారు వాళ్ళు.

ఒక మనోహర ఉద్యానవనం మధ్యలో పూలతిన్నె మీద కూర్చుని పరవశంగా గానం చేస్తున్నాడొక మహా గాయకుడు. ప్రక్కనే - వెండిలా మెరుస్తున్న జుట్టుగల ఒకాయన తన్మయంగా తల ఆడిస్తున్నాడు. వారికి ఎదురుగా మైమరచిన నాట్య మయూరిలా నృత్యం చేస్తున్నది ఒక కోమలాంగి.

తెర మీద అర్ధనగ్న సుందరీమణుల తైతక్కలు చూడటానికి అలవాటు పడిన మిత్రులకు ఆ భరత నాట్యం ఎంతో బాగా నచ్చింది. కాబరే కంటే భరత నాట్యమే మిన్న - అనిపించింది.

మరి కొంచెం ముందుకు వెళ్ళి నాట్యం చేస్తున్నది ఎవరా అని చూసారు. ఆమె మరెవరో కాదు, తిరువాన్కూరు సిస్టర్స్‌గా ప్రఖ్యాతి చెందిన త్రయంలో చివరి యామె, రాగిణి. సంభ్రమంగా మిత్రులు ఆమె వద్దకు వెళ్ళారు. నోళ్ళు నొప్పి పుట్టే వరకూ ఆమె నైపుణ్యాన్ని పొగిడారు. మా నిర్మాత

లకు బుద్ధి లేదు, శాస్త్రీయ నృత్యాలను ప్రోత్సహించటం లేదని ఆరోపించారు.

రాగిణి కోపంగా చూసింది, "మీరు జ్యోతిలక్ష్మి, జయమాలిని గంతుల్ని ఆదరించినట్లు శాస్త్రీయ నృత్యాలను ఆదరించటం లెదు కదా! నిర్మాతలు ఏం చేస్తారు?" అంది.

ఆమె కోపం చూసి బొంగుతున్న మిత్రులు ప్రసంగం మార్చివేసారు. "మీ అమ్మాయి భక్త ధృవ మార్కండేయలో చక్కగా నటించింది" అన్నారు.

వెంటనే రాగిణి నవ్వేసింది. కళ్ళలో మాతృప్రేమ తళుక్కుమంది. "మీరు భూలోకానికి వెళ్ళగానే మా చిన్నారికి నా ఆశీస్సులు, భానుమతిగారికి శుభాకాంక్షలు అందజేయండి" అంటూ మాయమయింది.

పూల తిన్నె వైపు చూసారు మిత్రులు. ఆ మహా గాయకుడు మరెవరో కాదు....ఘంటసాల!

వెంటనే మిత్రులు తిన్నె ముందు మోకరిల్లారు - టిట్టుబాబు తప్ప! అతడు శ్రీశ్రీకి తప్ప మరెవ్వరి ముందూ మోకరిల్లడు.

"తెలుగు చిత్ర లోకంలో మీరు లేని లోటు తీరనే లేదు మహా గాయకా!" అన్నాడు ఒడ్డూబాబు.

"తప్పు నాయనా! అబద్ధాలాడటానికి ఇది ఆంధ్రప్రదేశ్ కాదు, స్వర్గం! భూలోకంలో నేను లేని లోటు తీరడమే కాదు, నన్ను మించిన యశస్వి - బాలూ - అక్కడున్నాడు నేను కాలు మోపని హిందీ రంగములో అతను కాలు మోపడమే కాదు, జెండా ఎగరేసాడు."

"మేం నిజమే చెబుతున్నాం సార్" అని వాదించబోయాడు ఒడ్డుబాబు.

"ఆంధ్రులు శుష్కవాదనా ప్రియులు కదా!" అని నవ్వేసి, అంతర్ధానం అయాడు ఘంటసాల, వాదించటం యిష్టం లేక.

వారి వాదనను చిరునవ్వుతో తిలకిస్తున్న వెండిజుట్టు వ్యక్తి వేపు తిరిగారు మిత్రులు. ఆయన కృష్ణశాస్త్రిగారు!

మిత్రుల హృదయాలు ఉప్పొంగాయి, వెంటనే సాష్టాంగపడ్డారు టిట్టుబాబు తప్ప.

"నమో వాకములు కృష్ణశాస్త్రిగారూ! మీరు లేని తెలుగు సినీ సాహిత్యసీమ - బూతు, రోత, దుర్గంధభూయిష్టం ఐపోయింది" అన్నాడు నసబాబు, వేదన నిండిన స్వరంతో.

కృష్ణశాస్త్రి గళమెత్తి మాట్లాడకపోయినా, ఆయన కళ్ళే సమస్తమూ చెబుతున్నట్లున్నాయి.

"రెండు వైపులా పదును గల

చాకులాంటి వేటూరి వున్నాడు మీకు. కాని ఆయనను ఒక ప్రక్కనే వాడుకుంటున్నారు నిర్మాతలు. రెండో ప్రక్క చూడటమే లేదు. ప్రతిభ లేకపోలేదు కాని ఆ ప్రతిభను వాడుకునే నిర్మాతలే లేరు."

"నిర్మాతల ఒత్తిడి వల్ల బూతులు వ్రాసేవాడు అసలు కవే కాడు. మీరు నిర్మాతలకు లొంగలేదు. బూతులు రాయలేదు. వీళ్ళెందుకు రాయాలి? అసలు - మేం బూతులు రాయం - అని కవులందరూ కలిసి కట్టుగా వుంటే నిర్మాతలేం చేయగలరు?" కసిగా అడిగాడు తిట్టుబాబు.

అర్ధవంతంగా నవ్వి అంతర్ధానం అయాడు కృష్ణశాస్త్రి.

దిక్కులు చూస్తూ మరి కొంత దూరం వెళ్ళారు మిత్రులు. అక్కడ గాలి సోకగానే గిలిగింతలు పెట్టినట్లు అయింది వాళ్ళకు. ఎప్పుడూ గంభీరంగా వుండే తిట్టుబాబుకి కూడా నవ్వు వచ్చింది. అతనిని చూసి తిక్కబాబు నవ్వాడు. ఇలా ఒకరిని చూసి మరొకరు - కన్నీళ్లు వచ్చే పర్యంతం నవ్వుకున్నారు. అసలు ఆ వాతావరణంలోనే నవ్వు వుంది. పూలు నవ్వుతున్నాయి. చెట్లు నవ్వుతున్నాయి. పిట్టలూ నవ్వుతున్నాయి. మేఘాలు కూడా నవ్వుతున్నాయి.

ఈ నవ్వుకి కారణం ఏమిటా అని పరిశీలనగా చూసారు మిత్రులు. కొంత దూరంలో - సన్నగా, పొడవుగా పొట్లకాయలా కనిపించే ఒకడు, లావుగా పొట్టిగా సొరకాయలా వున్న మరొకనితో పింగ్ పాంగ్ ఆడుతున్నాడు. సొరకాయ కొట్టిన బంతి నోటి వరకూ రాగా బ్యాట్‌తో కొట్టడం మాని, గబుక్కున బంతిని పొట్లకాయ మింగేసింది! అదీ నవ్వుకి కారణం!

మిత్రులు మరింత దగ్గరగా వెళ్ళి చూసారు. వాళ్ళు మరెవ్వరో కాదు - రేలంగి, రమణారెడ్డి!

అందరితో బాటు తిట్టుబాబు కూడా వాళ్ళకి నమస్కరించాడు. ఆంధ్ర నుండి వచ్చిన అభిమానుల కోసం ఆట ఆపి వారిని ఇంట్లోకి ఆహ్వానించాడు రేలంగి.

"హాయిగా నవ్వుకునే అదృష్టం మీతోనే పోయింది గురూ!" నస బాబు విచారంగా అన్నాడు.

"అదేం, అక్కడ రాజబాబు, నూతన్, అల్లు - ఇంకా చాలా మంది వున్నారు కదా!"

"ఉన్నారు. కాని వాళ్ళెవరూ మీ

లాగ అన్ని పాత్రలకూ సరిపోరు గదా! వాళ్ళు హాస్యం చేయబోతే అపహాస్యం ఎదురవుతోంది" ఒడ్డు బాబు వాపోయాడు.

"మీరు తప్పక మా లోకం వచ్చేయాలి గురూ!" ప్రార్థించాడు నన బాబు.

"అలాగే, రేపే వచ్చేస్తాం" రేలంగి అన్నాడు.

ఎగిరి గంతేసారు మిత్రులు.

"వెర్రిబాబులూ! ఇక్కడ ఒక్క రోజు అంటే భూలోకంలో కొన్ని యుగాలు!" వివరించాడు రమణా రెడ్డి.

నీరుగారిపోయారు మిత్రులు.

"ఆంధ్ర నుండి అతిథులు వచ్చారా!!" ఆనందంగా అరుస్తూ పరుగెత్తుకు వచ్చింది ఒక స్త్రీ.

ఆమెను చూస్తూనే నిర్ఘాంతపోయారు మిత్రులు. ఆమె - మూగ మనసులోని ముద్దబంతి పూవులా అందంగా ఆరోగ్యంగా మిసమిసలాడిపోతున్న సావిత్రి!

కొద్ది కాలం క్రితం చిక్కి శల్యమై అతి దయనీయ పరిస్థితిలో ఉండిన సావిత్రి ఫోటోలు వారి స్మృతి పథంలో మెదిలి, ఇంతలో ఎంత మార్పు! - అని ఆశ్చర్యపోయారు.

సావిత్రి - తెలుగు చిత్రాల గురించి, కొత్తగా వస్తున్న నటీ నటుల గురించి, ఎన్నో విషయాలు వాళ్ళని అడిగి తెలుసుకుంది, మధ్య మధ్య రేలంగి పేల్చిన జోక్‌లకు నిర్మలంగా, మనసారా నవ్వుతూనే వుంది.

ఆమె అలా నవ్వుతోంటే, ఆ ఉత్సాహం చూస్తోంటే మిత్రులకు పరమానందం కలిగింది

"నేను భూలోకంలో ఆసుపత్రిలో వున్నప్పుడు-చాలా కాలం కోమాలో వున్నాను కదా! ఆ కాలంలో తాత్కాలికంగా యిక్కడకు వస్తూ వుండేదాన్ని. రేలంగి, రమణారెడ్డి గార్ల జోక్‌లకు నవ్వుకుని సర్వబాధలూ మరిచిపోయేదాన్ని. భూలోకం వదిలి శాశ్వతంగా ఇక్కడే ఉండిపోవా లనిపించింది. బ్రహ్మదేవుడికి అర్జీ పెట్టుకున్నాను. రేలంగిగారి రికమెండేషన్ వల్ల బ్రహ్మ అంగీకరించారు. ఆ కుళ్ళు లోకం విడిచి యిక్కడకు శాశ్వతంగా వచ్చేసాను...." అంటూ హాయిగా నవ్వింది. తన వారసులు వాణిశ్రీ, జయసుధలకు శుభాకాంక్షలు అందజేయమని చెప్పి వెళ్ళిపోయింది సావిత్రి.

"మా అభిమాన నటీమణులు గిరిజ, సూర్యకాంతంలకు కూడా అభినందనలు అందజేయండి" అన్నాడు రేలంగి.

సూర్యకాంతం పేరు వినగానే గుండె గుభేల్ మనగా. గాభరాగా లేచి ఎడమ చేత్తో గుండె నొక్కుకుంటూ "ఆ పేరు జ్ఞాపకం చేయకయ్యా బాబూ! అసలే బక్కప్రాణం నాది! చావు పుటకలు లేని ఈ స్వర్గంలో కూడా ఆ పేరు వింటే, గుండె ఆగిపోతుందన్న భయం కలుగుతోంది" అన్నాడు రమణారెడ్డి.

"కాయ్! కాయ్! ఎందుకమ్మా, సూర్యకాంతం అంటే నీకంత భయం? మరేమోనేమో నా కసలు భయం లేనే లేదు. నాకు రెట్టింపు పొడవున్నావ్, నీకెందు కమ్మా భయం?" గబగబా మాట్లాడుతూ పరుగులాంటి నడకతో వస్తున్న ఆ వ్యక్తిని చూసి దిగ్భ్రాంతి చెందారు మిత్రులు,

అతడు - నవ్వులరేడు - రాజబాబు! అయితే ఆంధ్రలో హాస్యానికి నిజముగా కరువొచ్చిందన్న మాట! - అని దిగులుపడ్డారు మిత్రులు.

రేలంగి, రమణారెడ్డి, రాజబాబు - గబగబా జోకులు పేల్చుకొని నవ్వుకుంటున్నారు. ఆ నవ్వులో పాలు పంచుకున్నారు మిత్రులు.

కరువు తీరా, ఒక సంవత్సరానికి సరిపడా నవ్వుకుని ముందుకు బయలుదేరారు మిత్రులు.

కొంత దూరంలో - దేవుని తాలు చుట్టూ కనిపించే కాంతి వలయం లాంటి వెలుగు కనిపించింది, వారికి. పవిత్రభావంతో ఒళ్ళు గగుర్పొడిచింది, వినయ వినమిత గాత్రులయారు. అక్కడ కనిపించే దృశ్యం ఏమయ్యుంటుందా అని ఆలోచిస్తూ అడుగులో అడుగు వేస్తూ నెమ్మదిగా కొంత ముందుకు వెళ్ళారు,

అక్కడున్నది దేవుడు కాదు గాని దైవ సమాన సౌజన్య మూర్తి - చిత్తూరు వి. నాగయ్య! యోగి వేషంలా కూర్చుని వున్నారు. ఆయన తలచుట్టూ కాంతి వలయం! మిత్రులు నమస్కరించారు.

నాగయ్యగారి ముఖంలో యేదో వెలితి, యేదో విచారం కొట్ట వచ్చినట్లు కనిపిస్తున్నాయి. స్వర్గంలో కూడా విచారం వుందాని - ఆశ్చర్య పోయారు మిత్రులు.

"ఎడతెగని సుఖం కూడా దుఃఖహేతువే నాయనలారా! ఈ స్వర్గంలో పని లేదు. శ్రమపడనక్కర లేదు. ఆకలి ఉండదు. దాహం ఉండదు. అంతా సుఖం....సుఖం, కాని అంత అన్నంలో యింత ఆవకాయగాని, గోంగూర పచ్చడి గాని కలుపుకొని గరిటెడు నేయి వేసుకుని సుష్టుగా భోజనం చేసాక

చుట్ట కాల్చుకుంటే వుందేహాయి - ఆకలి వేసిన వాడికే తెలుస్తుంది. ఆ హాయి ముందు యీ స్వర్గ సుఖం ఎంత? నాకీ సుఖం వద్దు. విరక్తి కలుగుతోంది. భూలోకానికే పోయి కష్టపడాలని పిస్తోంది'' అన్నారు నాగయ్య విషణ్ణంగా.

"సార్! సార్! మేము బ్రహ్మ గారిని కలుసుకొని మీ తరపున వాదించి మిమ్మల్ని భూలోకం తీసుకు పోతాం....ఇంతకూ బ్రహ్మ లోకానికి దారి యెటు?'' ఉత్సాహంగా అడిగారు మిత్రులు.

నాగయ్యగారి ముఖం లోని విషాదం తొలగి, చిరునవ్వు తాండవించింది. "పక్షులు ఎగిరినట్లు మీరు చేతులు కదిల్చితే చాలు పైకి వెళతారు, అలా పైపైకి వెళ్తున్న కొద్దీ దేవతల నివాసాలు కనిపిస్తాయి. ప్రతి యింటి ముందు నేమ్ బోర్డు ఉంటుంది. వెళ్ళిరండి. శుభమస్తు'' అని దీవించారు.

అలా వెళ్ళగా మొదట వారికి "శ్రీపురి'' ఎదురైంది. ఆ దివ్య భవనంలో ప్రవేశించగానే మొదట దర్శన మిచ్చినవాడు శ్రీ శ్రీ శ్రీ నారద మహర్షి!

"రండు రండు! బస్సు ప్రమాద బాధితులారా! రండు! స్వాగతం'' అని ఆప్యాయంగా ఆహ్వానించి చిత్రరంగ విశేషాలు కొసరి కొసరి అడిగి చివరకు - నటుడు నటునిగానే వుండపలెగాని రామారావు రాజకీయముల లోనికి దూకుట న్యాయమా? - అని ప్రశ్నించాడు నారదుడు,

అంతే తిట్టుబాబు విజృంభించాడు. ఎన్. టి- ఆర్ పాలనలో రాజ్యాంగం ఎలా ధ్వంసం అయినదీ, ఉద్యోగుల వయోపరిమితి తగ్గింపు వల్ల కలిగిన అనర్థం, మధ్యాహ్న భోజన పథకంలో పప్పన్నం బదులు రొట్టి, పాలు యివ్వడం వల్ల విద్యార్థుల్లో కలిగిన అసంతృప్తి - వివరంగా చెప్పాడు.

ఆ విమర్శ వింటూ ఉంటే బడ్డూబాబు హృదయం తూట్లు పడిపోయింది, ఆవేశం వచ్చేసింది మాదాలనూ అతని చిత్రాలనూ తూర్పార బట్టి'' రామారావు పాలనలో లోపాలు ఉండచ్చు, కాని ఆయన చిత్త శుద్ధిని శంకించలేం. సద్దుబుగా పడివున్న బానిస రాజకీయాలు యిప్పుడిప్పుడే ఆయన చలువ వల్ల చైతన్యవంతం అయాయి'' అన్నాడు.

మరుక్షణంలో బడ్డూబాబు, తిట్టుబాబూ - జుట్టూ జుట్టూ పట్టుకు

న్నారు. చొక్కాలు పీక్కున్నారు. ప్యాంటులు కూడా పీక్కుంటున్న తరుణంలో నసబాబు, తిక్కబాబు కలగజేసుకుని వారిని శాంతపరిచారు.
"నారాయణా! నారాయణా!" అని నవ్వుకుంటూ లోనికి పోయాడు నారదుడు.
విష్ణుమూర్తిని చూడటానికి లోనికి వెళ్ళాలా వద్దాని మిత్రులు ఆలోచిస్తూ ఉండగా—
"ఒరేయ్ ఒడ్డూ! ఇక్కడేం చేస్తున్నావ్‌రా?" అన్న గర్జన వినిపించి ఉలిక్కిపడ్డారు.
ఎదురుగా, ఒడ్డూబాబు తండ్రి!
"మరో లిప్త కాలంలో పరీక్షలొస్తున్నాయ్! చదువూ సంధ్యా లేదా? ఇక్కడ కూడా అభిమాన సంఘం స్థాపించడానికి వచ్చావా?" గర్జిస్తున్నాడు ఆయన.
ఈలోగా నసబాబు తాత వచ్చాడు.
"ఒరేయ్ నసా! భూ లోకంలో నీ తలిదండ్రులు నీ కోసం ఆందోళన పడుతున్నారు. అక్కడికి పో.... పో...." అంటూ నసబాబు నెత్తి మీద టంగ్‌మని ఒక మొట్టికాయ కొట్టాడు.
ఆ శక్తికి కాళ్ళ కింద మేఘం తప్పుకుంది. నసబాబు జారిపోయాడు జారిపోతూ, ప్రక్కనే ఉన్న ఒడ్డుబాబు కాళ్ళు పట్టుకున్నాడు. అంతే....ఇద్దరూ అగాధంలోకి కూలిపోయారు. కూలిపోతూ, కాళ్ళకు భూమి తగలగానే ఆగి కళ్ళు తెరిచారు.

ఎదురుగా డాక్టర్ కనిపించాడు.
"అయ్యో! అప్పుడే భూలోకానికి వచ్చేసాము!" అని మూల్గుకున్నారు వాళ్ళిద్దరూ - బాధగా కళ్ళు మూసుకుంటూ.
వాళ్ళకి ప్రమాదం తప్పింది. బ్రతికిపోయారు.

○ ○ ○

నసబాబు తాత - తిక్క తిట్టుబాబుల్ని అడిగాడు - మీరు కూడా భూలోకం పోతారా? - అని.
"మేం అప్పుడే వెళ్ళం తాతగారూ! ముందు బ్రహ్మను కలుసుకోవాలి. యింకా చాల ఉందిని కలుసుకోవాలి"
తిక్క. తిట్టుల్ని బ్రహ్మపురిలో విడిచిపెట్టాడు. నసతాత.
నాగయ్యను భూలోకానికి పంపవలసిన అవసరం గురించి బ్రహ్మ సమక్షంలో నొక్కి వక్కాణించారు మిత్రులు. బ్రహ్మ సావధానంగా విని సకాలంలో తగిన నిర్ణయం తీసుకుంటానన్నాడు.
తరువాత మిత్రులు సెన్సార్ సభ్యుల గురించి ఫిర్యాదు చేసారు.

ఒక చిత్రం పేరు "నిలువుదోపిడి" అంటే - అంగీకరించిన వాళ్ళు మరో చిత్రంలో నిలువుదోపిడి - బూతు మాట అని కత్తిరించేసారు? "విప్లవ శంఖం" పేరుని ఆమోదించిన పెద్దమనుషులు "విప్లవ సింహం" లోని విప్లవాన్ని కోసేసారు. చిత్రం నా వద్దకు వస్తే తోటకూర తరిగినట్లు తరిగేస్తానని ఒక సభ్యురాలు ప్రగల్భాలు పలుకుతోంది. ఒక భాషలో అనుమతించిన దృశ్యాల్ని డబ్బింగ్ చిత్రాలలోంచి తొలగిస్తున్నారు—అంటూ వివరాలన్నీ చెప్పి "సెన్సార్ సభ్యుల తలకాయల్లో కాస్త బుద్ధి, మరికాస్త కామన్ సెన్స్ వుండేటట్లు చేయి దేవా!" అని ప్రార్థించారు.

సరస్వతీ దేవి వైపు చూసి చిరునవ్వు చిందించాడు బ్రహ్మ. ఆ తర్వాత మిత్రుల వైపు తిరిగి "నాయనలారా? తొలుత మీ లోక జ్ఞానమును పరీక్షించెద. అటు తర్వాత.

"కోత సభ్యుల" తెలివి గురించి ఆలోచించుతము" అన్నాడు.

"అటులనే పరీక్షించుము దేవా."

"భారత దేశాధ్యక్షు లెవరు?"

"శ్రీమతి ఇందిగాంధీ!"

"అంతులే ఎవరు?"

"అంతులేని కీర్తిగల ఒక హిందీ నటుడు!"

"మరి మేనక?"

"హిందీ సినిమాల్లో కాబరే డాన్సర్!"

సరస్వతీ దేవి యిక నవ్వు ఆపుకోలేక పోయింది.

"నాయనలారా! తొలుత మీ లోక జ్ఞానమును అభివృద్ధి పరచుకొనుడు. అటు తరువాత కోత సభ్యులను విమర్శించ వచ్చును" అని ఇంటర్వ్యూ చాలించాడు బ్రహ్మ.

మిత్రులు బయటకు వస్తూ ఉండగా రక్షక భటుడు ఎదురయాడు—

"భూలోకంలో మీరు - గ్రేసు మార్కులతో పరీక్ష పాసై దొడ్డిదారిన మెడికల్ కాలేజీలో దూరి, పట్టా సంపాదించిన ఒక డాక్టర్ చేతిలో పడడం వల్ల - అక్కడ మీ నూకలు చెల్లినట్లు నూకల ఆఫీసర్ యిప్పుడే వార్త పంపాడు, యిక మీరు భూలోకాన్కి వెళ్ళడాన్కి వీల్లేదు" అన్నాడు.

"ధన్యోస్మి! మాకు కావలసింది అదే. యిక్కడే వుండి చిత్రపురిలోని నటీనటుల పాదాభిషేకం చేస్తూ చరితార్థులం అవుతాం" అన్నారు మిత్రులు పరమానందంగా. •